

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | సోమవారం 16 నవంబర్ 2026 | సంపుటి : 01, సంచిక : 54 | పేజీలు : 04, వెల రూ.2

మావోయిస్టుల హింసాకాండతో
ఆదివాసీలు నష్టపోయారు



- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- దేశం సాధించిన విజయాల్లో నక్సలిజం- మావోయిజం నుంచి విముక్తి పొందడం కూడా ఒకటని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు
- జనజాతీయ గౌరవ్ దివస్ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ

ఢిల్లీ :

మావోయిస్టుల హింసాకాండ వల్ల ఆదివాసీలు నష్టపోయారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గత ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా వారిని గాలికొదిలేశాయని ఆరోపించారు. నక్సలైట్లు గిరిజనుల ఓటు హక్కును సైతం కాలరాసినా నాటి పాలకులు చోద్యం చూస్తూ ఉండిపోయారని విమర్శించారు. స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా మహారాష్ట్ర గడ్చిరోలిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా ప్రసంగించారు. 3వేల కోట్ల రూపాయల విలువైన 246 అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. దశాబ్దాలుగా కనీస వసతులకు నోచుకోని గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మోదీ తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రగతి కోసం లక్ష కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. గిరిజన వర్గాలు ఎల్లప్పుడూ అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడ్డాయని ప్రశంసించారు. దేశంలో 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడం, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత్ సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటని అన్నారు."మావోల హింస వల్ల గిరిజన సమాజం ఎక్కువగా నష్టం పోయింది. 2014లో దేశంలోని దాదాపు 125 - మిగతా 2 లో



స్టార్‌షిప్‌ను ఒడిసిపట్టిన స్పేస్‌ఎక్స్

- ఏళ్ల నాటి కల సాకారం!
- అంతరిక్ష యాత్ర ముగించుకుని భూమికి చేరిన స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్
- టెక్సాస్‌లోని లాంచ్ టవర్ మెకానికల్ చేతులతో విజయవంతంగా క్యాచ్
- పునర్వినియోగ రాకెట్ల తయారీలో స్పేస్‌ఎక్స్ చారిత్రక మైలురాయి
- రాకెట్ రెండు భాగాలను తిరిగి పొందే ప్రణాళికలో కీలక ముందడుగు

ఢిల్లీ :

ప్రపంచ అంతరిక్ష ప్రయోగాల్లో స్పేస్‌ఎక్స్ సంస్థ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఏళ్ల తరబడి శ్రమిస్తున్న ఒక అసాధారణ లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించింది. అంతరిక్ష కక్ష్యలోకి వెళ్లి, భూమికి తిరిగి వచ్చిన తన స్టార్‌షిప్ వ్యోమనౌకను (అప్పర్ స్టేజ్) ఈరోజు టెక్సాస్‌లోని లాంచ్ టవర్ వద్ద ఉన్న భారీ యాంత్రిక చేతులతో సురక్షితంగా పట్టుకుంది. పూర్తిస్థాయిలో, వేగంగా - మిగతా 2 లో



1950 తర్వాత అత్యంత తీవ్రమైన ఎల్‌నినో

- 2027 వరకు ప్రపంచానికి తప్పని ముప్పు!
- 2027 మార్చి వరకు దీని ప్రభావం కొనసాగే అవకాశం
- పసిఫిక్ మహాసముద్రంలో రికార్డు స్థాయిలో పెరుగుతున్న ఉపరితల ఉష్ణోగ్రతలు
- ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో భారీ మార్పులు!
- అమెరికాకు చెందిన ఎన్‌వోఏఏ, డబ్ల్యూఎంవో సంస్థల నివేదిక

డిసెంబర్ మొదటి వారంలో
శీతాకాల సమావేశాలు

- మళ్లీ తెరముందుకు మహిళా రిజర్వేషన్ బిల్లు!
- పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది



ఢిల్లీ :

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై రాజకీయ వాతావరణం అంతకంతకూ ఘర్షణపూరితంగా మారుతున్న నేపథ్యంలో, డీలిమిటేషన్‌కు సంబంధించిన ప్రతిపాదిత మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రభుత్వానికి అతిపెద్ద శాసనపరమైన ప్రాధాన్యంగా మారింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. డీలిమిటేషన్ ద్వారా లోక్‌సభ బలాన్ని ప్రస్తుతమున్న 543 సీట్ల నుంచి గరిష్ఠంగా 850కి విస్తరించాలని కోరుతున్న ఈ రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేయడానికి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇది 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందు పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు మార్గం సుగమం చేయనుంది. - మిగతా 2 లో



హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం

- బొరంపేట వద్ద ఐదు బస్సుల దగ్ధం
- పార్కింగ్ యార్డులో నిలిపి ఉంచిన ఐదు బస్సులు దగ్ధం
- అర్ధరాత్రి వేగంగా వ్యాపించిన మంటలు
- షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని అనుమానం
- ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్ :

హైదరాబాద్ శివారు బొరంపేటలో శనివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ ప్రైవేట్ - మిగతా 2 లో

రాహుల్ గాంధీకి సీఎం బాడీగార్డ్‌లా వ్యవహరిస్తున్నారు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు
- కాంగ్రెస్ బీజేపీ నేతల తీరుపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- రాహుల్ బైక్ వెనుక మంత్రులు పరిగెత్తడంపై ఆగ్రహం
- తెలంగాణ పునాది ఆత్మగౌరవమన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- ప్రభుత్వ కార్యక్రమాల్లో రాహుల్ ప్రొటోకాల్‌పై బీఆర్ఎస్ ప్రశ్నలు
- ఫిట్‌గా ఉన్నందునే పరిగెత్తానన్న పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

ప్రధాని మోదీతో భేటీ అయిన రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి

- రాష్ట్రంలో కరవు నివారణ చర్యల కోసం రూ.30 వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలని విజ్ఞప్తి
- ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నమోదైన 17 శాతం లోటు వర్షపాతంపై ప్రధానికి వివరణ
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్, భేలో ఇండియా క్రీడలకు ప్రధానికి ఆహ్వానం
- తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు రావాలని ఆహ్వానం
- రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై ప్రధానితో చర్చ
- ఎల్‌నినోతో ఏర్పడిన కరవు పరిస్థితులు, ఆర్థిక సాయం గురించి వివరించిన సీఎం
- సమ్మక్క--సారక్క బ్యారేజీ క్లియరెన్స్ ప్రక్రియ వేగవంతం చేయాలని అభ్యర్థన



హైదరాబాద్ :

ఢిల్లీలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాసేపటి క్రితం సమావేశమయ్యారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ, కరవు పరిస్థితులను అధిగమించడానికి, రైతులను ఆదుకోవడానికి తక్షణమే రూ.30 వేల కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్యాకేజీ రూపంలో అందించాలని ప్రధానికి విజ్ఞప్తి చేస్తూ ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ భేటీలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ కూడా ఈ సమావేశంలో ఉన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం తీవ్రంగా పడిపోయిన తీరును ముఖ్యమంత్రి ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు రాష్ట్రంలో సుమారు 17 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు వివరించారు.రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకు గాను 31 జిల్లాల్లోని 365 మండలాలను ఇప్పటికే కరువు ప్రాంతాలుగా ప్రకటించిన విషయాన్ని రేవంత్ రెడ్డి ప్రధానికి తెలియజేశారు. ఇందులో 111 మండలాలు తీవ్ర కరవు బారిన పడగా, 254 మండలాలు మధ్యస్థాయి కరవును ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. వర్షాభావం కారణంగా ఖరీఫ్ సీజన్ సాగు విస్తీర్ణం 139.28 లక్షల ఎకరాల నుంచి 126.06 లక్షల ఎకరాలకు తగ్గిపోయిందని వివరించారు. - మిగతా 2 లో

పంచాయతీ ఎన్నికల సందడి
తొలి విడత నామినేషన్లు షురూ

- ఏపీలో మొదలైన గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ
- తొలి దశలో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఎన్నికలు
- 17వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- నవంబరు 26న పోలింగ్, అదే రోజు ఫలితాలు
- భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేసిన పోలీసులు



అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, తొలి విడత ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రారంభం. మొదటి దశలో అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని పలు మండలాల్లో ఎన్నికలు జరగనుండగా, ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగాలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి.తొలి విడతలో భాగంగా అనంతపురం జిల్లాలోని కల్యాణదుర్గం, అనంతపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 13 మండలాల్లోనూ, కర్నూలు జిల్లాలోని ఆదోని, పత్తికొండ డివిజన్ల పరిధిలోని 8 మండలాల్లోనూ ఎన్నికలు నిర్వహించనున్నారు. అభ్యర్థులు నవంబర్ 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. 18న నామినేషన్ల పరిశీలన చేపట్టనుండగా, 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు గడువు ఉంటుంది. అనంతరం అదే రోజు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.నవంబర్ 26న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. పోలింగ్ ముగిసిన వెంటనే మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు. అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియను కూడా - మిగతా 2 లో

రాష్ట్రానికి మరో
తుపాను ముప్పు



- ప్రస్తుతం ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం కేంద్రీకృతమైంది
- ఉత్తర కోస్తా వైపు తుపాను కదలికలు
- బంగాళాఖాతంలో బలపడుతున్న వాయుగుండం
- ఏపీ, దక్షిణ ఒడిశాకు వాతావరణ శాఖ హెచ్చరిక
- తీర ప్రాంతాలపై తుపాను ప్రభావం ఉండే అవకాశం

అమరావతి :

రాష్ట్రానికి మరో తుపాను ముప్పు ముంచుకొస్తోంది. ఏపీ, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలకు వాతావరణ శాఖ తుపాను ముందస్తు హెచ్చరిక జారీ చేసింది. ప్రస్తుతం - మిగతా 2 లో



సీఎం చంద్రబాబు కాన్వాయ్‌లోకి
కొత్త వాహనాలు

- ఆరు ఫోర్స్ అర్బానియా వాహనాల కొనుగోలుకు ఆమోదం
- వాహనాల కోసం రూ. 1.78 కోట్లు మంజూరు చేసిన ఏపీ ప్రభుత్వం
- జెమ్ పోర్టల్ ద్వారా కొనుగోలు ప్రక్రియ
- భద్రతా సిబ్బంది ప్రయాణ సౌలభ్యం కోసం ఆధునిక ఏర్పాట్లు


అమరావతి :

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రతా విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం సెక్యూరిటీ కాన్వాయ్ అవసరాల దృష్ట్యా - మిగతా 2 లో

సంపాదకీయం

అమెరికా ఎన్నికల పాఠం!

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు కాంగ్రెస్‌ను తిరిగి కైవసం చేసుకున్నారు. అక్కడ గెలిచిన అభ్యర్థులు మాట్లాడిన విషయాలు మన రాజకీయ పార్టీలకు, ముఖ్యంగా ప్రతిపక్షాలకు, ఎంతో నేర్పుతాయి. అమెరికాలో ఓటర్లు ఈ ఎన్నికల్లో ఆర్థిక పరిస్థితుల పట్ల ఆందోళనతో పోలింగ్ బూత్‌లకు వెళ్లారు. ఎన్‌బీసీ ఎగ్జిట్‌పోల్ ప్రకారం, 88శాతం మంది నిత్యావసర సరుకుల ధరల గురించి; 86శాతం మంది కరెంటు, నీటి బిల్లుల గురించి; 85శాతం మంది వైద్య ఖర్చుల గురించి ఆందోళన చెందారు. గెలిచిన అభ్యర్థులూ వీటి గురించే మాట్లాడారు. నార్త్ కరోలినాలో రాయ్ కూపర్ 'ధరలు తగ్గిద్దాం' అనే నినాదంతో ప్రచారం మొదలుపెట్టారు. సౌత్ కరోలినాలో అనీ ఆండ్రూస్ అందరికీ అందుబాటులో వైద్యం, తక్కువ ఖర్చు అనే అంశాలపై పోటీ చేశారు. ఇంకా చాలామంది అభ్యర్థులు ఇలాంటి సమస్యలపైనే మాట్లాడారు. అలా అని వాళ్లు అమెరికాలో పెరుగుతున్న జాతి విద్వేషాల గురించీ, హింస గురించీ మాట్లాడలేదని కాదు. అమెరికన్ ఓటర్ల ఆందోళనలో ఆర్థిక వ్యవస్థ తర్వాత రెండో స్థానంలో ప్రజాస్వామ్యమే ఉంది. గెలిచినవాళ్లు చేసింది ఏమిటంటే, ఈ రెండింటినీ కలిపి చెప్పడం. వాళ్లందరి సందేశం సరళమైనది. అధికారం కొద్దిమంది చేతుల్లోకి వెళ్లిందంటే దాని ఫలితంగా మీ ఇంటి అద్దె పెరుగుతుంది, ఆసుపత్రి బిల్లులు పెరుగుతాయి. ఈ సందేశం ఎలా పనిచేసిందంటే-- విలువల గురించి మాట్లాడితే అప్పటికే ఆ విలువల గురించి ఆందోళన చెందే కొందరి సమ్మతి మాత్రమే లభిస్తుంది. అదే ఆ విలువలను వంటింటి సమస్యలతోనో పెరుగుతున్న ధరలతోనో ఆరోగ్య వసతితోనో కలిపి చెప్తే అప్పుడు అందరూ కదులుతారు.మన దేశంలో ఈ సమస్యలు మరింత దారుణంగా ఉన్నాయి. రిటైల్ ద్రవ్యోల్బణం 6.09శాతానికి పెరిగింది. ఆహార ద్రవ్యోల్బణం 8.94శాతానికి ఎగబాకింది. నగరాల్లో ద్రవ్యోల్బణం 5.41శాతం ఉంటే, గ్రామాల్లో అది 6.63శాతం. ఒక రోజువారీ కూలీకి కూరగాయలు, పప్పుల మీద పెరిగే ప్రతి రూపాయి, పిల్లల పుస్తకాల నుంచో, ఆసుపత్రికి వెళ్లే ఖర్చు నుంచో కోత పడుతున్నది. నగరాల్లో యువత నిరుద్యోగం 19శాతానికి చేరింది. జాతీయ ఆరోగ్య సంస్థ తాజా అంచనాల ప్రకారం, ప్రస్తుత ఆరోగ్య వ్యయంలో దాదాపు సగాన్ని ప్రజలు తమ జేబు నుంచే భరిస్తున్నారు. ఈ సమస్యలకు నగరాల్లో అద్దెలు, పాఠశాల ఫీజులు, ప్రభుత్వ శిశు సంరక్షణ సౌకర్యాల కొరత కలిపితే... సామాన్య భారతీయుడి జీవితాన్ని ప్రభావితం చేసే అసలు ఎజెండా ఏమిటో అర్థమవుతుంది.2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు సీఎస్‌డీఎస్--లోక్‌నీతి సర్వేలో 27శాతం మంది నిరుద్యోగాన్ని తమ ప్రధాన సమస్య అని చెప్పారు. 23శాతం మంది ధరల పెరుగుదల అని చెప్పారు. ఇందుకు భిన్నంగా రామమందిరం తమ ఓటును నిర్ణయించే ప్రధాన అంశమని చెప్పింది 8శాతం మంది మాత్రమే. భారతదేశ సామాజిక, సాంస్కృతిక, మత స్వరూపంలో వస్తున్న మార్పులు ముఖ్యం కాదని అనలేం. కానీ మీ జీవితాన్ని, మీ ఓటును ఏది నిర్ణయిస్తుందని ప్రజలను అడిగినప్పుడల్లా వాళ్ల సమాధానం మళ్లీ మళ్లీ ఉద్యోగాలు, ధరల దగ్గరకే వస్తోంది.ఈ ఏడాది పేపర్ లీక్ కారణంగా దేశ యువత రోడ్ల మీదకు వచ్చింది. వారి నిరసనలు విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చేంత పెద్దవయ్యాయి. సెప్టెంబర్, అక్టోబర్ నాటికి ఈ నిరసనలు ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ దాకా విస్తరించాయి. పరీక్షల విశ్వసనీయత, న్యాయమైన ఎన్నికలు అత్యంత ముఖ్యమైనవే. కానీ యువత ఆగ్రహం లోతుల్లోకి చూస్తే నిరుద్యోగం, ఆర్థికంగా ఎదిగే అవకాశాలు లేకపోవడమే ఈ నిరసనలకు దారితీసిందని అర్థమవుతుంది.నగర విద్యార్థుల ఉద్యమం ఎంత ప్రభావవంతంగా ఉన్నప్పటికీ అది ఒక్కటే రాజకీయ ఎజెండాను మార్చలేదు. గ్రామీణ భారతం కూడా అందులో కలవాలి. గ్రామాలు ఇప్పటికీ అవే సమస్యలతో సతమతమవుతున్నాయి. గ్రామీణ యువత నిరుద్యోగం నానాటికీ పెరుగుతూనే ఉంది. డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న యువకుడు, కోచింగ్ ఫీజు కట్టలేని యువతి, నీట్ పేపర్ వాట్సాప్‌లో లీకవడం చూసిన రైతు కొడుకు... వీళ్లందరిలోనూ ఢిల్లీ విద్యార్థిలోని ఆగ్రహమే ఉంది. కానీ వ్యక్తం చేయడానికి వాళ్లకు వేదికలు తక్కువ. నగర --గ్రామీణ ప్రపంచాల మధ్య బంధం బలపడినప్పుడు, గ్రామీణ పేదలు, నగర యువత ఒకేలాంటి విషయాల గురించి మాట్లాడటం మొదలుపెట్టినప్పుడు, అప్పుడవి 'యువత సమస్యలు'గానో, రైతుల సమస్యలు'గానో మిగలవు. రాజకీయ పోటీకి కేంద్ర బిందువులు అవుతాయి. రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే అంశాల చుట్టూ ప్రజలను సంఘటితం చేయాలి. పప్పు ధర, నగరంలో గది అద్దె, ప్రైవేటు ఆసుపత్రిలో ప్రసవ ఖర్చు, డిగ్రీ తర్వాత ఎప్పటికీ రాని ఉద్యోగం ఇలాంటి రోజువారీ సమస్యలను న్యాయం, అధికారం అనే పెద్ద ప్రశ్నలతో ముడిపెట్టాలి. పేదల తరఫున మాట్లాడాలనుకునే ఏ పార్టీ అయినా అమెరికా మధ్యంతర ఎన్నికల నుంచి నేర్చుకోవాల్సిన పాఠం ఇదే.



మావోయిస్టుల హింసాకాండతో ఆదివాసీలు నష్టపోయారు

మొదటిపేజీ తరువాయి -

జిల్లాలు మావోయిజం, నక్సలిజంతో ఇబ్బందిపడ్డాయి. ఏటా వందలాది హింసాత్మక ఘటనలు జరిగేవి. ఈ ఘటనల్లో వేలాది మంది అమాయకులు తమ ప్రాణాలను కోల్పోవాల్సి వచ్చింది. మృతుల్లో ఆదివాసీ సోదర సోదరీమణులే అత్యధిక సంఖ్యలో ఉండేవారు. గత ప్రభుత్వాలు మావోయిజం, నక్సలిజం బారిన పడిన గిరిజనులను గాలికి వదిలేశాయి. గిరిజనుల హక్కులను లాక్కున్నా నోటికి తాళం వేసుకుని కూర్చున్నారు. గిరిజన సమాజ సోదర సోదరీమణులను కనీసం ఓటు కూడా వేయనిచ్చేవారు కాదు. అప్పటి ప్రభుత్వాలు కేవలం ప్రేక్షక పాత్ర వహిస్తూ కళ్లు మూసుకున్నాయి. నేడు నక్సలిజం-మావోయిజం పూర్తిగా అంతం కావడంతో గిరిజన సమాజానికి చెందిన తల్లులు, సోదరీమణులు మాకు తమ ఆశీస్సులను అందిస్తున్నారు. దేశం సాధించిన విజయాల్లో నక్సలిజం-మావోయిజం నుంచి విముక్తి పొందడం కూడా ఒకటి. కొద్ది రోజుల క్రితమే ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ కేంద్రంలో నేను భద్రతా దళాలతో కలిసి దీపావళి జరుపుకొన్నాను. ఒకప్పుడు ప్రజలు వెళ్లడానికి కూడా భయపడిన ప్రాంతం అది. గడ్చిరోలితో సహా నక్సల్ ప్రభావిత ప్రాంతాలన్నింటిలోనూ ఇప్పుడు కేవలం దీపావళి దీపాలే కాకుండా, ప్రజల జీవితాల్లో ఒక కొత్త ఆశాకిరణం కూడా ప్రసరించింది.'జనజాతీయ గౌరవ్ దివస్' అనేది గిరిజన సమాజం గౌరవానికి, గిరిజన నాయకుడు బిర్సా ముండా అందించిన స్ఫూర్తికి సంబంధించిన పండుగ అని ప్రధాని మోదీ అభివర్ణించారు. "2021 నవంబర్ 15 నుంచి 'జనజాతీయ గౌరవ్ దివస్' (గిరిజన గౌరవ దినోత్సవం) జరుపుకొంటున్నాం. నేడు ఇది ఒక జాతీయ వేడుకగా మారింది. గతేడాది భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా 2 లక్షలకు పైగా కార్యక్రమాలు జరిగాయి. వీటిలో కోట్ల మంది పౌరులు పాల్గొన్నారు. ఒకప్పుడు అనేక పండుగలు, సందర్భాలు విదేశీ దృక్కోణం నుంచి నిర్ణయించేవారు. కానీ నేడు, భారతదేశం తన వారసత్వాన్ని, చరిత్రను, వీరులను స్వదేశీ గర్వంతో స్మరించుకుంటోంది. ఇది మన జాతీయ చైతన్యంలో వచ్చిన ఒక పెద్ద మార్పునకు సంకేతం." అని ప్రధాని మోదీ అన్నారు. భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నవంబర్ 15న జనజాతీయ గౌరవ్ దివస్‌ను పాటిస్తారు. 1875లో గిరిజన సమాజంలో జన్మించిన బిర్సా ముండా, బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన గిరిజన ప్రతిఘటనలో ప్రముఖ నాయకుడిగా ఎదిగారు.

1950 తర్వాత అత్యంత తీవ్రమైన ఎల్‌నినో

మొదటిపేజీ తరువాయి - ప్రపంచ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే ఎల్‌నినో మరింత బలపడుతోంది. 1950 తర్వాత ఇదే అత్యంత శక్తిమంతమైన ఎల్‌నినోగా మారనుందని, దీని ప్రభావం 2027 మార్చి వరకు కొనసాగవచ్చని అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్‌వోఏఏ) తాజాగా హెచ్చరించింది. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సరళిలో భారీ మార్పులకు కారణం కానుందని ఆందోళన వ్యక్తం చేసింది.ఎల్‌నినో కారణంగా భూమధ్యరేఖ వెంబడి పసిఫిక్ మహాసముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయిలో వేగంగా పెరుగుతున్నాయి. ఈ పెరుగుదల గతంలోని అన్ని రికార్డులను బద్దలు కొట్టనుందని ఎన్‌వోఏఏ తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వర్షపాతంలో తీవ్ర వ్యత్యాసాలు చోటుచేసుకుంటాయి. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించనుండగా, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్ర కరవు పరిస్థితులు నెలకొంటాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా, ప్రపంచవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు పెరగడం, అడవుల్లో కార్చిచ్చులు అధికమవడం వంటి పరిణామాలు కూడా సంభవిస్తాయి.ఎన్‌వోఏఏ, ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) నివేదికల ప్రకారం, ఎల్‌నినో తీవ్రత క్రమంగా పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా 2027 జనవరి నుంచి మార్చి మధ్య కాలంలో ఇది అత్యంత బలమైన స్థాయిలో కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వివిధ దేశాలు వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రధాని మోదీతో భేటీ అయిన రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి - కరవు సహాయక చర్యలతో పాటు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు, నిధుల కేటాయింపులపై కూడా చర్చించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'తో పాటు 'ఖేలో ఇండియా' క్రీడల ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధాని మోదీని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.



స్టార్‌షిప్‌ను ఒడిసిపట్టిన స్పేస్‌ఎక్స్

మొదటిపేజీ తరువాయి - పునర్వినియోగించగల రాకెట్లను తయారు చేయాలనే స్పేస్‌ఎక్స్ లక్ష్య సాధనలో ఇది ఒక చారిత్రక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.ఇవాళ భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున 2:52 గంటలకు 'షిప్ 42' అనే ఈ స్టార్‌షిప్‌ను లాంచ్ టవర్‌కు అమర్చిన 'చాప్‌స్టిక్స్' అనే భారీ మెకానికల్ చేతులు గాల్లోనే పట్టుకున్నాయి. ఈ అద్భుత ఘట్టానికి ముందు, స్టార్‌షిప్ దాదాపు 22 గంటలకు పైగా అంతరిక్షంలో గడిపింది. నవంబర్ 14న సౌత్ టెక్సాస్‌లోని స్టార్‌బేస్ నుంచి నింగిలోకి ఎగిసిన ఈ రాకెట్, భూమికి 275 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న నిమ్న భూకక్ష్యకు చేరుకుంది.తన 15వ ఇంటిగ్రేటెడ్ ఫ్లైట్ టెస్ట్‌లో భాగంగా, ఈ స్టార్‌షిప్ కక్ష్యలో ఉన్న సమయంలో భూమి చుట్టూ దాదాపు 14 సార్లు ప్రదక్షిణలు చేసింది. ఈ యాత్రలో అత్యంత కీలకమైన 26 నెక్స్ట్ జనరేషన్ స్టార్‌లింక్ ఎ3 ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. అంతేకాకుండా వ్యోమనౌకతో పాటు పంపిన మూడు ఉపగ్రహాలు స్టార్‌షిప్ హీట్ షీల్డ్ (వేడి కవచం), ఇతర భాగాలను నిశితంగా పరిశీలించాయి. భూమికి తిరిగి వచ్చే ప్రయాణానికి నౌక ఎంత సిద్ధంగా ఉందో అంచనా వేయడానికి ఈ కెమెరాల ద్వారా అందిన సమాచారం ఇంజనీర్లకు ఎంతగానో సహాయపడింది.అన్ని తనిఖీలు పూర్తయిన తర్వాత, స్టార్‌షిప్ తన ఇంజిన్లను మండించి (డీ-ఆర్బిట్ బర్న్) భూ వాతావరణంలోకి ప్రవేశించడం ప్రారంభించింది. కిందకు దిగే క్రమంలో తన వేగాన్ని నియంత్రించుకుంటూ, స్టార్‌బేస్‌లోని లాంచ్ టవర్‌కు కచ్చితంగా వచ్చేలా తనను తాను మలచుకుంది. ఆ తర్వాత టవర్‌కు ఉన్న రెండు భారీ యాంత్రిక చేతులు వ్యోమనౌకను సున్నితంగా పట్టుకుని, లాంచ్ ప్యాడ్ పైన గాలిలో నిలిపివేశాయి.గతంలో స్పేస్‌ఎక్స్ తన సూపర్ హెవీ బూస్టర్లను విజయవంతంగా రికవరీ చేసి, తిరిగి ఉపయోగించినప్పటికీ, కక్ష్య నుంచి తిరిగి వచ్చిన స్టార్‌షిప్ అప్పర్ స్టేజ్‌ను ఇలా టవర్‌తో పట్టుకోవడం ఇదే తొలిసారి. రాకెట్‌లోని రెండు భాగాలను (బూస్టర్, అప్పర్ స్టేజ్) తిరిగి భూమికి తెచ్చి, తనిఖీ చేసి, మళ్లీ ప్రయోగాలకు వాడాలన్నది స్పేస్‌ఎక్స్ ప్రణాళిక. తాజా విజయంతో ఆ ప్రణాళికలో ఒక ముఖ్యమైన భాగాన్ని నిరూపించినట్లయింది.ఈ 15వ ప్రయోగంలో వాస్తవానికి రాకెట్‌కు చెందిన రెండు భాగాలను టవర్‌తో పట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, సూపర్ హెవీ బూస్టర్‌ను పట్టుకునే ప్రణాళిక చివరి నిమిషంలో రద్దు కావడంతో, అది గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్రంలో సురక్షితంగా ల్యాండ్ అయింది.ఈ చిన్న లోపం మినహా, స్టార్‌షిప్ అప్పర్ స్టేజ్‌ను పట్టుకోవడం ద్వారా ఈ మిషన్ ఒక ప్రధాన లక్ష్యాన్ని సాధించింది. రాకెట్లను పునర్వినియోగించడం ద్వారా ప్రయోగాల ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చు. ఇది భవిష్యత్తులో చంద్రుడు, అంగారకుడిపైకి మానవసహిత యాత్రలు చేపట్టాలన్న స్పేస్‌ఎక్స్ ఆశయాలకు మరింత ఊతమిస్తుంది.

రాహుల్ గాంధీకి సీఎం బాడీగార్డ్‌లా వ్యవహరిస్తున్నారు

మొదటిపేజీ తరువాయి -

తెలంగాణ రాష్ట్రం ఆత్మగౌరవం అనే ప్రాతిపదికన ఏర్పాటయిందని, అయితే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఈ విషయాన్ని ఎప్పటికీ అర్థం చేసుకోలేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొన్న కార్యక్రమాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల తీరుపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు.తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతలకు పదవుల తాలూకు హుందాతనం, గౌరవం తెలియకుండా పోయిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. గాంధీ కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక బాడీగార్డులా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు సైతం రాహుల్ గాంధీ నడుపుతున్న బైక్ వెనుక నౌకర్ల మాదిరిగా పరుగులు తీస్తున్నారని ఎద్దేవా చేశారు. శనివారం నాడు గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్ గాంధీ నిర్వహించిన బైక్ ర్యాలీ దృశ్యాలను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఇదే సమయంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని కూడా కేటీఆర్ తప్పుపట్టారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గతంలో అమిత్ షా కాళ్లకు మొక్కడం, ఆయన చెప్పులు మోయడం వంటి చర్యలను గుర్తుచేస్తూ, ఇది అత్యంత సిగ్గుచేటైన, అనుచితమైన ప్రవర్తన అని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఈ రెండు జాతీయ పార్టీలు ఏనాడూ గౌరవించలేవని ఆయన స్పష్టం చేశారు.కాగా, రాహుల్ గాంధీ బైక్ వెనుక తాను పరిగెత్తడంపై టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టత ఇచ్చారు. తాను కూడా బైక్‌పైనే వెళుతున్న క్రమంలో వాహనం స్కిడ్ అయ్యిందని, రాహుల్ గాంధీ తనను గమనించి పక్కకు పిలిచారని తెలిపారు. తాను శారీరకంగా ఫిట్‌గా ఉన్నందునే పక్కనే పరిగెత్తుకుంటూ వెళ్లానని, రాహుల్ గాంధీ వెంట అలా పరిగెత్తడం తన అదృష్టంగా భావిస్తున్నానని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.మరోవైపు, అధికారిక ప్రభుత్వ కార్యక్రమాల్లో రాహుల్ గాంధీ పాల్గొనడంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని నీతులు చెబితే సరిపోదని, ముందుగా రాజ్యాంగ విలువలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికింది. ఏ హోదాలో, ఏ ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రారంభిస్తున్నారని ప్రశ్నించింది. రాహుల్ గాంధీ శనివారం గిగ్ వర్కర్ల సంక్షేమ ప్యాకేజీని ప్రకటించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'భారత్ సమ్మిట్' ముగింపు సభలో ప్రసంగించిన నేపథ్యంలో బీఆర్ఎస్ ఈ ప్రశ్నలను సంధించింది.

పంచాయతీ ఎన్నికల సందడి తొలి విడత నామినేషన్లు షురూ

మొదటిపేజీ తరువాయి - పూర్తి చేస్తారు.ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థితో పాటు మరో ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ర్యాలీలు, ఊరేగింపులపై ఆంక్షలు విధించామని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం చంద్రబాబు కాన్వాయ్‌లోకి కొత్త వాహనాలు

మొదటిపేజీ తరువాయి - కొత్త వాహనాలను సమకూర్చడానికి అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కాన్వాయ్‌లోకి కొత్తగా 6 అత్యాధునిక 'ఫోర్స్ అర్బానియా' వాహనాలను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హోంశాఖ అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది.ముఖ్యమంత్రి కాన్వాయ్ కోసం ఈ 6 వాహనాల కొనుగోలుకు సుమారు రూ. 1.78 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ప్రక్రియను పూర్తిగా నిబంధనల ప్రకారం పారదర్శకంగా చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా 'జెమ్' పోర్టల్ ద్వారా కొనుగోలు ప్రక్రియను త్వరలోనే పూర్తి చేయాలని అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.సీఎం కాన్వాయ్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించే భద్రతా సిబ్బంది ప్రయాణం మరింత సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆధునిక హంగులు, విశాలమైన స్థలం, అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించేందుకు అనువైన సాంకేతిక ఫీచర్లు ఈ వాహనాల్లో ఉన్నాయి. ఈ కొత్త వాహనాల చేరికతో భద్రతా సిబ్బంది రాకపోకలు మరింత వేగవంతం కావడంతో పాటు ముఖ్యమంత్రి కాన్వాయ్ పనితీరు, సామర్థ్యం మరింత మెరుగుపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఈ వాహనాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

రాష్ట్రానికి మరో తుపాను ముప్పు

మొదటిపేజీ తరువాయి - ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం కేంద్రీకృతమైంది. ఇది గంటకు సుమారు 10 కిలోమీటర్ల వేగంతో ఉత్తర దిశగా కదులుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు గుర్తించారు. ఇది ప్రస్తుతానికి చెన్నైకి 840 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 1010 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్ కు 1130 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. ఈ వాయుగుండం తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.ఈ వాయుగుండం తదుపరి ఉత్తర- వాయువ్య దిశగా కదిలి తర్వాత దక్షిణ, మధ్య పశ్చిమ బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశముంది. ఆ తర్వాతి రెండురోజుల్లో వాయవ్య దిశగా కదులుతూ రాష్ట్ర తీరప్రాంతం వైపు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ప్రస్తుతం వాయుగుండం గమనాన్ని వెదర్ డాప్లర్ రాడార్ల ద్వారా నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం అంచనాల ప్రకారం దీని ప్రభావం రాష్ట్రంలోని ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశా ప్రాంతాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం

మొదటిపేజీ తరువాయి - పార్కింగ్ యార్డులో నిలిపి ఉంచిన ఐదు ట్రావెల్స్ బస్సులు మంటలకు ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొడ్రాయి సమీపంలో గల పార్కింగ్ స్థలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సులను ఒకదానికొకటి అతి సమీపంలో నిలిపి ఉంచడంతో, ఒక బస్సులో మొదలైన మంటలు శరవేగంగా ఇతర బస్సులకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో మూడు బస్సులు పూర్తిగా దగ్ధం కాగా, మరో రెండు బస్సులు పాక్షికంగా దెబ్బతిన్నాయి.అర్ధరాత్రి సమయంలో దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు, సమీపంలోని పెట్రోల్ బంక్ సిబ్బంది వెంటనే అగ్నిమాపక కేంద్రానికి, పోలీసులకు సమాచారం అందించారు. జీడిమెట్ల ఫైర్ స్టేషన్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బస్సులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే, బస్సుల సమీపంలోని చెత్తకుప్పకు నిప్పు అంటుకుని మంటలు వ్యాపించి ఉండవచ్చనే కోణంలోనూ విచారణ జరుపుతున్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు, జరిగిన ఆస్తి నష్టంపై అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈ-సిగరెట్ల అక్రమ దందాపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం!

ఈగల్ డీఎస్పీ

హైదరాబాద్‌లో టీనేజర్లను లక్ష్యంగా చేసుకొని

సాగుతున్న నిషేధిత ఈ-సిగరెట్ల అక్రమ దందాపై

ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం మోపుతోంది

ఈ-సిగరెట్లు దొరక్కుండా చేస్తామని డీఎస్పీ

మధు మోహన్ రెడ్డి తెలిపారు.

హైదరాబాద్‌లో యువత, టీనేజర్లను లక్ష్యంగా చేసుకొని సాగుతున్న నిషేధిత ఈ-సిగరెట్ల అక్రమ దందాపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం మోపుతోంది. రాయదుర్గంలోని ఓ అవుట్‌లెట్‌పై దాడిచేసి భారీగా నిషేధిత వేప్స్, విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. పన్నులు ఎగ్గొట్టి చైనా నుంచి అక్రమంగా దిగుమతి చేసుకుంటూ ర్యాపిడో, ఉబర్, ఓలా వంటి యాప్‌ల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా డెలివరీ చేస్తున్నట్లు గుర్తించామని ఈగల్ డీఎస్పీ మధు మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ అక్రమ దందాపై ఈటీవీ భారత్ ముఖాముఖిలో అనేక వివరాలు వెల్లడించారు.2019 లో కేంద్ర ప్రభుత్వం వేప్స్, ఈ-సిగరెట్లపై నిషేధం విధించింది. ఈజీ మనీ కోసం కొంతమంది వ్యక్తులు వీటిని చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం లాంటి ప్రాంతాల్లో కేరళకు చెందిన వ్యక్తులు కూల్‌డ్రింక్‌లు, పెర్‌ఫ్యూమ్ షాపుల మాటున వేప్స్, ఈ-సిగరెట్ల దందా పకడ్బందీగా నడుపుతున్నట్లుగా గుర్తించాం. ఆయా షాపులకు సంబంధించి ప్రత్యేక వాట్సప్ గ్రూప్‌ను క్రియేట్ చేసుకొని, ఆ గ్రూపులో కస్టమర్లను యాడ్ చేసుకుంటున్నారు. వేప్స్, ఈ-సిగరెట్ల కొత్త స్టాక్ వివరాలు ఆ గ్రూప్‌లో పోస్ట్ చేస్తారు. రోజుకో ఫ్లేవర్ ఉందంటూ ఆ గ్రూప్‌లో ఎక్కువగా ఉన్న టీనేజర్లను ఆకర్షిస్తున్నారు. కొన్ని షాపులోనే అమ్మకాలు చేస్తుండగా, మరికొన్ని వాట్సప్ ద్వారా ఆర్డర్ తీసుకుని కస్టమర్ లొకేషన్‌కు పోర్టర్ ద్వారా, ర్యాపిడో, ఉబర్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నట్లు తెలిసింది. పన్నులు చెల్లించకుండా అక్రమమార్గంలో దందా చేస్తున్నారు. మామూలు సిగరెట్ కంటే నాలుగు రెట్ల హానికరమైన నికోటిన్ కలిగి ఉండే ఈ-సిగరెట్ల వల్ల యువత ఆరోగ్యానికి తీవ్రనష్టం కలుగుతోంది.కేరళంలోని కాసరగోడ్‌కు చెందిన వారు ఎక్కువగా దుబాయిలో ఉంటారు. అక్కడ కొంతమంది ఈ నిషేధిత ఉత్పత్తులను దుబాయి నుంచి ముంబయికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. 2 నెలల్లో 11 కేసులు, 16 మందిని అరెస్ట్ చేశాం. 1600 కు పైగా ఈ-సిగరెట్లు సీజ్ చేశాం. ఆన్‌లైన్ పేమెంట్ కోసం వాడుత

నామినేషన్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

ముదిగుబ్బ, బత్తలపల్లిలో పర్యటించిన అడిషనల్ ఎస్పీ అంకిత సురానా





శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి ధరువు న్యూస్: పంచాయతీ ఎన్నికల తొలి విడత నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలోని ముదిగుబ్బ, బత్తలపల్లి మండలాల్లో నామినేషన్ కేంద్రాలను అడిషనల్ ఎస్పీ అంకిత సురానా ఐపీఎస్ ఆదివారం సందర్శించారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, వాగ్వాదాలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అభ్యర్థులు, ప్రతిపాదకులు ఎన్నికల నిబంధనలు పాటించేలా చూడాలని, కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో పోలీసు శాఖ అన్ని భద్రతా చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ పర్యటనలో డీఎస్పీలు రవిబాబు, శ్రీనివాసులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పుట్టపర్తి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

- దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు



పుట్టపర్తి, ధరువు న్యూస్; పుట్టపర్తి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా చేరికల పర్వం కొనసాగుతోంది. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారందరికీ దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారి వివరాలు: బుక్కపట్నం మండలం – గశికవారిపల్లి గ్రామం: దాసరి మల్లేష్, సి. లక్ష్మీనారాయణ, కొండాపురం గంగప్ప, చిన్నకేశవులు. బుక్కపట్నం మండలం – కొత్తకోట గ్రామం: రాజశేఖర్, గంగాద్రి, హరి, వీరజిన్నప్ప, రాజేష్. అమడగూరు మండలం – మహమ్మదాబాద్ పంచాయతీ: రాజశేఖర్ (నిలువురాతిపల్లి), శివకుమార్ (నిలువురాతిపల్లి), ప్రసాద్ (బావి చెరువుపల్లి). వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, నాయకత్వంపై ఉన్న నమ్మకంతోనే తాము పార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లమాడ సర్పంచ్ అభ్యర్థిగా టీడీ రఘునాథరెడ్డి విస్తృత ప్రచారం

ఒక్క అవకాశం కల్పించండి.. పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తా



నల్లమాడ, ధరువు న్యూస్: నల్లమాడ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న టీడీ రఘునాథరెడ్డి ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చెరువు వాండ్లపల్లి, కొత్తపల్లి, నల్లమాడ ఎస్సీ కాలనీలో పర్యటించి ఓటర్లను కలుసుకున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ తనకు ఒక అవకాశం కల్పించి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవి కోసం కాకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో ఎన్నికల బరిలో నిలిచినట్లు తెలిపారు. సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు రహదారులు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన కుటుంబం గత ఎనిమిదేళ్లుగా సుమారు రూ. 30 లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా ప్రజలకు ఉచితంగా తాగునీరు అందిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా పలువురు గుర్తుచేసుకున్నారని తెలిపారు. ప్రచారంలో భాగంగా పలువురు ఓటర్లు ఆయనను ఆప్యాయంగా పలకరించి తమ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరణించిన జనసేన కార్యకర్త కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

కష్టకాలంలో కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం.. జనసేన నాయకులు



పుట్టపర్తి ధరువు న్యూస్: అనారోగ్యంతో మృతిచెందిన జనసేన కార్యకర్త గొర్ల రమేష్ కుటుంబానికి పార్టీ నాయకులు రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పుట్టపర్తి నియోజకవర్గం అమడగూరు మండలం బావిచెరువుపల్లి గ్రామానికి చెందిన రమేష్ మూడు రోజుల క్రితం అనారోగ్య కారణాలతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న జనసేన నాయకులు గ్రామానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకుల సహకారంతో సేకరించిన రూ. 50 వేల నగదును తొట్ల గంగాధర్ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యకర్తల కుటుంబాలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం తమ బాధ్యతని, రమేష్ కుటుంబానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ మేకల ఈశ్వర్, మార్కెట్ యార్డు చైర్మన్ పూల శివప్రసాద్, సొసైటీ చైర్మన్ కె.నరేష్, వెంకటేష్ నాయక్, గందోడి సతీష్, కరుణాకర్, అనిల్, ఉత్తప్ప, జగదీష్, కిషోర్, దినేష్, వేణు, కొండబోయిన సతీష్, డేరంగుల ఉపేంద్ర, చక్రపాణి, రామ్మోహన్, ధనుంజయ, జయసింహ తదితరులతో పాటు అమడగూరు, ఓడిసి మండలాల జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల నామినేషన్ల సందడి షురూ!

తొలి రోజు సర్పంచులకు 309, వార్డు మెంబర్లకు 281 నామినేషన్లు

కొత్తచెరువు, ధరువు న్యూస్: శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం తొలి రోజు ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. డివిజన్‌లోని మొత్తం 7 మండలాల పరిధిలో మొదటి రోజు సర్పంచ్ పదవులకు 192 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 230 నామినేషన్లు దాఖలైనట్లు పుట్టపర్తి జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఒక ప్రకటనలో వెల్లడించారు. మండలాల వారీగా మొదటి రోజు దాఖలైన నామినేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి: ధర్మవరం: సర్పంచ్ పదవులకు 39, వార్డు సభ్యులకు 42
ముదిగుబ్బ: సర్పంచ్ పదవులకు 35, వార్డు సభ్యులకు 31, కనగానపల్లి: సర్పంచ్ పదవులకు 34, వార్డు సభ్యులకు 41, చెన్నేకొత్తపల్లి (సి.కె.పల్లి): సర్పంచ్ పదవులకు 31, వార్డు సభ్యులకు 28, బత్తలపల్లి: సర్పంచ్ పదవులకు 24, వార్డు సభ్యులకు 23, రామగిరి: సర్పంచ్ పదవులకు 18, వార్డు సభ్యులకు 62
తాడిమర్రి: సర్పంచ్ పదవులకు 11, వార్డు సభ్యులకు 3
తొలి రోజు సర్పంచ్ స్థానాలకు అత్యధికంగా ధర్మవరం మండలంలో 39 నామినేషన్లు దాఖలు కాగా, అత్యల్పంగా తాడిమర్రి మండలంలో 11 నామినేషన్లు వచ్చాయి. అలాగే వార్డు సభ్యుల స్థానాలకు రామగిరి మండలంలో రికార్డు స్థాయిలో 62 నామినేషన్లు దాఖలు కావడం విశేషం. నవంబర్ 17 వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనున్న నేపథ్యంలో రానున్న రెండు రోజుల్లో నామినేషన్ల సంఖ్య మరింత భారీగా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

అనంతపురం, ధరువు న్యూస్: గ్రామ పంచాయతీ ఎన్నికలు--2026లో భాగంగా అనంతపురం జిల్లాలో తొలి రోజు ఆదివారం సర్పంచ్ స్థానాలకు 309, వార్డు మెంబర్ స్థానాలకు 281 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ తెలిపారు. తొలి విడతలో ఎన్నికలు జరిగే అనంతపురం, కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 13 మండలాల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. మండలాల వారీగా అనంతపురం రూరల్‌లో సర్పంచులకు 54, వార్డులకు 63, ఆత్మకూరులో 29, 18, బొమ్మనహాల్‌లో 31, 39, బ్రహ్మసముద్రంలో 14, 3, డి.హీరేహాల్‌లో 25, 36, గుమ్మఘట్టలో 16, 10, కళ్యాణదుర్గంలో 27, 15, కంబదూరులో 11, 4, కనేకల్‌లో 20, 37, కుందుర్పిలో 13, 1, రాప్తాడులో 36, 39, రాయదుర్గంలో 16, 8, శెట్టూరులో 17, 8 నామినేషన్లు దాఖలయ్యాయి.

పులివెందులలో నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి దంపతులు

పులివెందుల/కొత్తచెరువు, ధరువు న్యూస్: పులివెందుల పట్టణానికి చెందిన ఇరగం క్రాంతి కుమార్ రెడ్డి, నిరీష దంపతుల నూతన గృహప్రవేశ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. ఈ శుభకార్యానికి పుట్టపర్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు శ్రీ దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, దుద్దుకుంట అపర్ణ రెడ్డి దంపతులు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన క్రాంతి కుమార్ రెడ్డి, నిరీష దంపతులకు మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి దంపతులు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నూతన గృహం వారి కుటుంబానికి ఆయురారోగ్యాలను, అష్టైశ్వర్యాలను, సుఖసంతోషాలను ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ వారిని ఆశీర్వదించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ఆప్యాయంగా ముచ్చటించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ గృహప్రవేశ వేడుకల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, క్రాంతి కుమార్ రెడ్డి బంధుమిత్రులు మరియు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులకు అభినందనలు తెలిపారు.



పుట్టపర్తిలో డిసెంబర్ 1న ఢిల్లీని ముట్టడిద్దాం



శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి ధరువు న్యూస్: కార్మికుల హక్కుల సాధన కోసం డిసెంబర్ 1న సీఐటీయూ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించనున్న కార్మికుల మహా ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ కార్యాలయంలో ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు, గోడపత్రికలను రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కార్మికులందరికీ నెలకు రూ. 42 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి శాశ్వత ఉద్యోగులుగా కొనసాగించాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, కార్మికులందరికీ ఉపాధి భద్రత కల్పించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 1న ఢిల్లీలో జరిగే మహా ముట్టడిలో కార్మికులు, ఉద్యోగులు, స్కీం వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెడ్.పి. శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎల్. నరసింహులు, జిల్లా కోశాధికారి ఎన్. లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు పైపల్లి గంగాధర్, బాబ్జాన్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నితీష్ జన్మదిన వేడుకలు



చిత్తూరు,నవంబర్ 15 :చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఏకైక కుమారుడు గురజాల నితీష్ జన్మదిన వేడుకలను ఆదివారం చిత్తూరు నగరంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. తొలుత స్థానిక బీవీ రెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో తండ్రి గురజాల జగన్మోహన్, తాతయ్య గురజాల చెన్నకేశవులునాయుడు, తల్లి గురజాల ప్రతిమ సమక్షంలో నితీష్ భారీ కేక్ కట్ చేశారు. అనంతరం అక్కడికి హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కేక్ పంపిణీ చేశారు. స్థానిక మెకానికల్ క్రీడా మైదానంలో క్రీడాకారులు, విద్యార్థుల సమక్షంలోనూ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట టీడీపీ నాయకులు, 12వ డివిజన్ ఇన్‌ఛార్జి మౌళి రాధాకృష్ణ, 13వ డివిజన్ కార్పొరేటర్ జగ్గా ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా నితీష్ కేక్ కట్ చేసి నగరవాసులకు పంపిణీ చేశారు. మౌళి రాధాకృష్ణ, జగ్గా సౌజన్యంతో సుమారు 500 మందికి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మౌళి రాధాకృష్ణ, జగ్గా మాట్లాడుతూ తమ అభిమాన ఎమ్మెల్యే తనయుడు నితీష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. నితీష్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో చిత్తూరు నగర మేయర్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, రాష్ట్ర టీడీపీ మాజీ అధికార ప్రతినిధి వి. సురేంద్రకుమార్, 12వ డివిజన్ కార్పొరేటర్ షాహిదా గౌస్ బాషా, గుడిపాల మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, చిత్తూరు నగర టీడీపీ ప్రధాన కార్యదర్శి పచ్చప్ప, చిత్తూరు నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు దామా లీలావతి, కూటమి నాయకులు ఉదయ్ కుమార్, నాగలక్ష్మి, ఫైరోజ్ ఖాన్, అక్తర్ భాషా, జాఫర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం, నవంబర్ 15, దరువు న్యూస్ :



కార్తీకమాసం సందర్భంగా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తిరుమలలో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. తన శ్రేయోభిలాషులతో కలిసి తిరుమల చేరుకున్న ఎమ్మెల్యే స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. కార్తీకమాసంలో శ్రీవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా, అదృష్టంగా ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. స్వామివారి దివ్య ఆశీస్సులతో అనంతపురం నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.

ఆంజనేయస్వామి పునఃప్రతిష్ఠాపన

మహోత్సవంలో వేణుగోపాల్ రావు

లేపాక్షి, నవంబర్ 15, దరువు న్యూస్ :



పెనుకొండలోని సోసలె వ్యాసరాయ మఠంలో శ్రీశ్రీశ్రీ విద్యాశ్రీష స్వామీజీ వారి దివ్య హస్తాలతో నిర్వహించిన శ్రీ ఆంజనేయస్వామి పునఃప్రతిష్ఠాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ పవిత్ర మహోత్సవ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, అడ్వకేట్, లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ పరిగి వేణుగోపాల్ రావు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ ఆశీస్సులు అందుకున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని, స్వామివారి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

18న వాహనాల బహిరంగ వేలం

కళ్యాణదుర్గం, నవంబర్ 15, దరువు న్యూస్ :

వివిధ ఎక్సైజ్ నేరాల్లో స్వాధీనం చేసుకున్న నాలుగు వాహనాలకు 18వ తేదీ (బుధవారం) బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కళ్యాణదుర్గం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఉదయం 10 గంటలకు ఈ వేలం పాట ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి గల వారు తమ ఆధార్, పాన్ కార్డు నకళ్లు (జిరాక్స్), జీఎస్టీ (జిఎస్టి) వివరాలతో హాజరు కావాలని సూచించారు. రూ. 3,000 ధరావతు (డిపాజిట్) చెల్లించి ఎంట్రీ పాస్ పొందిన వారిని మాత్రమే వేలంలోకి అనుమతిస్తామని ఆయన స్పష్టం చేశారు.

పల్లెల్లో పటిష్ట నిగ్గు డీఎస్పీ దైవ ప్రసాద్

కళ్యాణదుర్గం, నవంబర్ 15, దరువు న్యూస్ :



పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కళ్యాణదుర్గం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని అతి సమస్యాత్మక గ్రామాలను ఇప్పటికే గుర్తించి పటిష్ట నిగ్గు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ దైవ ప్రసాద్ తెలిపారు. నామినేషన్ అంటే స్పీకర్ నుంచి ఓటర్ లెక్కింపు వరకు నిరంతరం పోలీస్ భద్రత కల్పిస్తామన్నారు. ఎన్నికల ప్రశాంతంగా పారదర్శకంగా జరిగేలా గ్రామాలలో పోలీస్ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఛట్టే షరీఫ్ వేడుక



బుక్కరాయసముద్రం, నవంబర్ 15, దరువు న్యూస్ :

మండల కేంద్రంలోని నల్లగుట్ట కాలనీలో 'ఆస్థానా-యే నూరుస్ మావాతి' లోని మెహబూబ్ సుబహాని జండా కట్ట వద్ద ఆదివారం భక్తిశ్రద్ధలతో ఛట్టీ షరీఫ్ వేడుకను నిర్వహించారు. హజరత్ హుజూర్ ఖ్వాజా గరీబ్ నవాజ్ రహ మతుల్లాలై జ్ఞాపకార్థం సలాం, ఫాతేహా ఖానీ నిర్వహించి, సమస్త మానవాళికి సృష్టి కర్త అల్లాహ్ సన్మార్గం చూపాలని, శాంతిని చేకూర్చాలని దువా చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్థానా యెక్క శిష్య బృందం, కాలనీవాసులు పాల్గొన్నారు.

రాప్తాడు సర్పంచ్ అభ్యర్థినిగా జూటూరు భాగ్యమ్మ



రాప్తాడు, నవంబర్ 15, దరువు న్యూస్ :

మండల కేంద్రం రాప్తాడు గ్రామ సర్పంచ్ అభ్యర్థినిగా వైసీపీ మద్దతుతో గ్రామానికి చెందిన జూటూరు భాగ్యమ్మ ఆదివారం నామినేషన్ కేంద్రంలో రిటర్నింగ్ అధికారి వరలక్ష్మి సమక్షంలో నామినేషన్ వేశారు. భాగ్యమ్మ మాట్లాడుతూ.. తన భర్త జూటూరు శేఖర్ వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కార్యకర్తగా మండల కన్వీనర్‌గా బాధ్యతలను నిర్వహించారన్నారు. అదేవిధంగా బీసీ సెల్ మండల కార్యదర్శిగా కూడా పనిచేశారన్నారు. వైసీపీ అధికా రంలో ఉన్న సమయంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు మంజూరయ్యేలా చర్యలు చేపట్టారని, మండలంలోని ప్రతి గ్రామంలోనూ వివాదరహితంగా ఉన్నాడన్నారు. వైసీపీ మద్దతు రాప్తాడు సర్పంచ్ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న తనకు పంచాయి తీకి చెందిన ప్రతి ఓటరు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నామినేషన్ కార్యక్రమంలో వైసిపి మాజీ కన్వీనర్ రామాంజనేయులు, గంజి అభిలాష్, జయన్న తదితరులు పాల్గొన్నారు.

మా సేవలు గుర్తించి మమ్మల్ని ఆదుకోండి

ప్రభుత్వానికి వెటరన్ జర్నలిస్టుల విజ్ఞప్తి

అనంతపురం, నవంబర్ 15, దరువు న్యూస్ :



'చాలా ఏళ్లపాటు పాత్రికేయులుగా మా వంతు సేవలందించాం. ఎలాంటి ప్రయోజనాన్ని ఆశించలేదు. ప్రస్తుతం మేం వృద్ధాప్యంలో ఉన్నాం. పెన్షన్ ఇచ్చి మమ్మల్ని ఆదుకోండి'.. అంటూ అనంతపురం జిల్లాలోని వెటర్న్ వెటర్న్ జర్నలిస్టులు ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆదివారం జిల్లాలోని సీనియర్ పాత్రికేయులు (వెటరన్) తమ సమస్యలపై చర్చించేందుకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ పాత్రికేయులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ముఖ్యంగా 60 ఏళ్ల దాటిన ప్రతి జర్నలిస్టుకు కనీసం రూ.20వేల పెన్షన్ ఇవ్వాలని.. అలాగే వెటరన్ జర్నలిస్టుల కుటుంబాలకు పూర్తిగా ఉచిత వైద్యాన్ని అందించాలని, ప్రతి ఏటా అక్రిడిటేషన్ కోసం దరఖాస్తులు ఆహ్వానించకుండా శాశ్వత ప్రాతిపదికన రాష్ట్రస్థాయి ప్రభుత్వ గుర్తింపును ఒకేసారి మంజూరు చేయాలని వారు చర్చించి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకై అవసరమైన పక్షంలో వయస్సు రిత్యా కష్టనష్టాలు ఉన్న ఆందోళన బాట పట్టడానికైనా సిద్ధంగా ఉన్నామని సీనియర్ పాత్రికేయులు స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్ల పాటు ఎలాంటి జీతభత్యాలు లేకుండా సామాజిక బాధ్యతగా సేవలందించామని ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి గుర్తు చేశారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి తమ అమూల్యమైన సేవలను గుర్తించి న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీనియర్ పాత్రికేయులు ఆజాద్, ప్రభాకర్ నాయుడు, రాజేంద్రప్రసాద్, మార్కండేయులు, లక్ష్మీనారాయణ, పార్థసారథి, బాబాసాహెబ్, షఫీ ఉల్లా, దాసు, పట్నం మారుతి ప్రసాద్, షేక్ బికారి, గార్లదిన్నె మనోహర్, భూపాలం సతీష్, సంజీవరెడ్డి, రామాంజనేయులు తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తీర్మానాల రూపంలో ప్రభుత్వానికి పంపాలని నిర్ణయించారు.

'అనంత' అధ్యక్షుడిగా పట్నం మారుతి

అనంతపురం జిల్లా వెటర్న్ జర్నలిస్ట్ సంఘం అధ్యక్షుడిగా పట్నం మారుతి ప్రసాద్ ను ఎన్నుకున్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా భూపాలం సతీష్ ఎన్నికయ్యారు. జిల్లా సంఘం కోశాధికారిగా బాబాసాహెబ్ ను ఎన్నుకున్నారు. అనంతరం సంఘం సభ్యులు మాట్లాడుతూ.. తమ జీవితాలను త్యాగాలు చేసిన ప్రతి జర్నలిస్టు కుటుంబానికి ప్రయోజనం కలిగించేలా ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి ప్రయోజనాన్ని చేకూరుస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన


పెద్దవడుగూరు, నవంబర్ 15, దరువు న్యూస్ :



59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెద్దవడుగూరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పుస్తక ప్రదర్శన విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జె.శివప్రసాద్, ఎంపీపీ మెయిన్ స్కూల్ ఉపాధ్యాయులు ఎం.వెంకట్‌రెడ్డి, రామ్మోహన్, ఎస్.భాషా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జె.శివప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో అపారమైన పుస్తక సంపద అందుబాటులో ఉందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పురాతనమైన, విజ్ఞానాన్ని అందించే ఎన్నో విలువైన పుస్తకాలు గ్రంథాలయాల్లో ఉన్నాయని, ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు రామ్మోహన్ మాట్లాడుతూ.. పుస్తక ప్రదర్శనల ద్వారా గ్రంథాలయంలో ఎలాంటి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయో విద్యార్థులకు అవగాహన కలుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు ఎం.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పుస్తకానికి ఒక పాఠకుడు ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సాహిత్యం, విజ్ఞానం, చరిత్రతో పాటు వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదవాలని తెలిపారు. ఏ పుస్తకమూ తక్కువ కాదని, చిన్న పుస్తకం చదివినా ఎంతో విలువైన జ్ఞానాన్ని సంపాదించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఎస్.భాషా, గ్రామ పెద్దలు బి.నారాయణ, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పుస్తక ప్రదర్శనలో మొత్తం 28మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే..

లయన్స్ క్లబ్ ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



పామిడి, నవంబర్ 15, దరువు న్యూస్ :

పట్టణంలోని వాసవి కళ్యాణ మండపం నందు ఆదివారం పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, శంకర కంటి ఆసుపత్రి (బెంగుళూరు) కంటి వైద్య నిపుణులు డాక్టర్ శరణ్య మాట్లాడుతూ.. కంటి సంరక్షణ కొరకు ముందు జాగ్రత్తలు, నివారణ చర్యలు గురించి తెలియజేశారు. బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్, సూక్ష్మ క్రిముల నుండి కళ్ళను రక్షించుకోవాలని తెలియజేశారు. కళ్ళు మన శరీరంలో చాలా సున్నితమైన అవయవాలు వాటిని చాలా జాగ్రత్తగా సంరక్షించుకోవాలన్నారు. పామిడి లయన్స్ క్లబ్ అధ్యక్షులు పట్రా శ్రీనివాసులు, జిల్లా చైర్మన్ జయరాం రావులు మాట్లాడుతూ.. కళ్ళు మానవునికి దేవుడిచ్చిన అత్యంత బహుమతి అని అన్నారు. ఈ అందమైన ప్రపంచాన్ని చూపించే అవయవాలు కళ్ళు అన్నారు. కంటి చూపు బాగుంటే ఎవరి పనులు వారే చూసుకోగలరని వ్యాఖ్యానించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ శరణ్య కంటి వైద్య శిబిరానికి వచ్చిన 120 మందిని పరీక్షించి, అందులో 47మందిని కంటి ఆపరేషన్ కు రెఫర్ చేశారు. ఈ శిబిరానికి వచ్చిన వారికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరం నందు జిల్లా పర్సన్స్ డాక్టర్ శాంతి ప్రియ, డాక్టర్ మురళీకృష్ణ, కమిత్కర్ రఘువీర్ రావు, మానవ హక్కుల కమిషన్, పర్యావరణ పరిరక్షణ దక్షణ భారతదేశ సెక్రటరీ అవుల ప్రసాద్, క్లబ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పట్రా నరేష్ కుమార్, డైరెక్టర్స్ పట్ర రాకేష్, అంజి నాయక్, నల్లయ్య, శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ శివ, శంకర హాస్పిటల్ సిబ్బంది, లక్ష్మీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు అవసరం

వైద్య శిబిరంలో డాక్టర్ కృష్ణమూర్తి

అనంతపురం, నవంబర్ 15, దరువు న్యూస్ :



ప్రస్తుత శీతాకాల వాతావరణంలో మూర్ఛ వ్యాధి రోగులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ నందు నిర్వహించిన ఉచిత మూర్ఛ వ్యాధి శిబిరానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మూర్ఛ వ్యాధి పట్ల రోగులకు భయము ఆందోళన అవసరం లేదని డాక్టర్ల సూచన మేరకు మందులు వాడడంతోనే మనకున్నటువంటి జబ్బును నియంత్రణలో ఉంచుకోవచ్చు అని అన్నారు. ప్రస్తుతం శీతాకాలం అయినందున మిగిలిన రోజులతో పోల్చుకుంటే మరింతగా జాగ్రత్తలు అవసరమని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.జెవివి నగర కమిటీ ఆధ్వర్యంలో అనేక ఏళ్లుగా ఈ శివరాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన తెలిపారు. ఒకప్పుడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో నగరంలో మాత్రమే నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రస్తుతం జెవివి ఆధ్వర్యంలో హిందూపురం, కదిరి, రాయదుర్గం, గుత్తి లాంటి చోట్ల కూడా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలియజేశారు. రోగులు క్రమం తప్పకుండా ఇక్కడ జరుగుతున్న శిబిరానికి హాజరై తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకొని తమకు అవసరమైన మందులను తీసుకెళ్తున్నట్లు ఆమె తెలిపారు. ఈరోజు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వంద మందికి పైగా హాజరైనట్లు కన్వీనర్ రామకృష్ణ తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ హరి కిషోర్, జెవివి నగర నాయకులు ఎస్. తిరుపాల్, ప్రసాద్ రెడ్డి, రామిరెడ్డి, మన్సూర్, శివచరణ్, నూర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి సేవలో మరూరు గోపాల్ దంపతులు

రాప్తాడు, నవంబర్ 15, దరువు న్యూస్ :





అయ్యప్పస్వామి మాలధారులకు అన్నదానం చేయడం మహా పుణ్యకార్యమని టీడీపీ సీనియర్ నాయకుడు, మరూరు సొసైటీ అధ్యక్షుడు గోనుగుంట్ల గోపాల్, మాజీ ఎంపీటీసీ లక్ష్మీదేవి దంపతులు పేర్కొన్నారు. ఆదివారం మరూరు గ్రామంలో వారు తమ ఆధ్యాత్మిక భక్తిభావాన్ని చాటుకుంటూ, మాలధారులకు ప్రత్యేక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. శబరిమల యాత్రలో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుమారు 60మంది అయ్యప్ప మాలధారులు కాలినడకన రాప్తాడు మండలం మరూరు గ్రామానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న గోనుగుంట్ల గోపాల్ దంపతులు వారికి సాదర స్వాగతం పలికారు. కాలినడకన వచ్చిన 60 మంది స్వాములతో పాటు, మరూరు గ్రామానికి చెందిన మరో 40మంది అయ్యప్ప మాలధారులకు భక్తిశ్రద్ధలతో భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోపాల్ దంపతులు స్వాములకు స్వయంగా వడ్డించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. కఠిన దీక్షతో కాలినడకన యాత్ర చేస్తున్న స్వాములకు సేవ చేసే భాగ్యం కలగడం తమ అదృష్టమని వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 100మంది అయ్యప్ప భక్తులతోపాటు తక్కెళ్ల సూరీ, కేశవ, వెంకటేశ్, భగవంతు, శేషయ్య, లింగమనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.